ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 30 మే 2025

తీరంలో అలజడి

- బందరువానిపేట వద్ద ఎగిసి పడుతున్న కెరటాలు
- మునిగిన వలలు, తెప్పలు
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు



బందరువానిపేట తీరం వద్ద ఎగిసిపడుతున్న సముద్రపు అలలు



నీటిలో మునిగిన వలలు

గార, మే 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా బందరువానిపేట వద్ద సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. సముద్రపు ఒడ్డున భద్రపరుచుకున్న వలలు, తెప్పలు గురువారం ముంపునకు గురయ్యాయి. అవి ఇసుకలో కూరుకుపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సముద్రం పొంగి నీరు చాలా ముందుకు గ్రామం వరకు రావడంతో ఆ ప్రాంతమంతా జలమయంగా మారింది. దేవతా గుడుల చుట్టూ కూడా నీరు చేరింది. మరోవైపు తీరం సైతం కోతకు గురైంది. వలలు, తెప్పలను సురక్షిత ప్రాంతానికి తీసుకురావడానికి కూడా మత్స్యకారులుకు అవకాశం లేకుండాపోయింది. మత్స్యకారులు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లలేదు.



కోతకు గురైన తీరం

నైరుతి రుతు పవనాలపై అప్రమత్తం

- పటిష్ట ప్రణాళికతో పనిచేయాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఆయన గురువారం జిల్లా అధికారులతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత ఏడాది ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన నిబంధనల మేరకు కార్యాచరణను రూపొందించి, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ఫోన్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చెరువుల గట్లను తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో (మిగతా 6వ పేజీలో..)

బంగాళాఖాతంలో వాయుగుండం 7 లో

ముగిసిన బదిలీల ప్రక్రియ

- 93మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలకు స్థానచలనం



నరసన్నపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ముగిసింది. ఐదేళ్ల పాటు సర్వీసు పూర్తి చేసిన వారితో పాటు రిక్వస్టు బదిలీపై 121 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సుమారు 93 మందికి స్థానచలనం కలిగింది. వీరంతా జూన్ 1న కొత్తపాఠశాలల్లో చేరాల్సి ఉంది. కాగా, స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 పదోన్నతుల కౌన్సిలింగ్ గురువారం నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 82 పోస్టులకు గాను 1:2నిష్పత్తి ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఉదయం 8 గంటలకే అభ్యర్థులు కౌన్సిలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, రాష్ట్రస్థాయిలో పదోన్నతుల కౌన్సిలింగ్‌పై సాంకేతిక పరమైన ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి 7 గంటల వరకు ఉపాధ్యాయులు (మిగతా 6వ పేజీలో..)

చంపేస్తున్నారు!

- గ్రానైట్ క్వారీల్లో ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్‌లు
- అనుమతి లేకుండా పేలుడు పదార్థాల వినియోగం
- నిబంధనలు పట్టని వైనం.. ఐదేళ్లలో 20మంది మృతి
- ప్రకృతి వనరులు విధ్వంసమవుతున్నా పట్టని అధికారులు
- ప్రమాదం జరిగినప్పుడే తనిఖీల పేరిట హడావుడి





మెళియాపుట్టి: వీఆర్‌టీ గ్రానైట్ క్వారీని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

- ఎచ్చెర్ల మండలం చిలకపాలెం నుంచి పొందూరు వెళ్లే రోడ్డులో రాత్రిపూట భారీ శబ్దాలు వినిపిస్తుంటాయి. ఆ రోడ్డు చెంతనే క్వారీలు అధికంగా ఉంటాయి. నిత్యం బాంబుల మోతతో పరిసర గ్రామాలు దద్దరిల్లిపోతుంటాయి. ఆయా గ్రామాల వారు అధికారులకు ఫిర్యాదు ఇవ్వడం...వారు వాటిని బుట్టదాఖలు చేస్తుండడం సాధారణంగా మారింది. కనీసం ఆయా క్వారీల్లో ఏం జరుగుతుందో కూడా అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేయరు.

- ఇటీవల జిల్లా వ్యాప్తంగా క్వారీల్లో అధికారులు తనిఖీలు చేశారు. మెళియాపుట్టి మండలంలో ఓ క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, భూగర్భ గనులు, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. పోలీస్ జాగిలాలతో ఈ తనిఖీలు సాగాయి. కానీ ఏం నివేదిక ఇచ్చారో మాత్రం తెలియడం లేదు.

రణస్థలం/మెళియాపుట్టి, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహజ వనరులుగా ఉన్న కొండలను కొందరు కొల్లగొడుతున్నారు. తమకున్న పలుకుబడితో లీజులు సంపాదించి అడ్డగోలుగా కొండలను గుల్ల చేస్తున్నారు. నిబంధనలను పక్కనపెట్టి క్వారీల్లో యథేచ్ఛగా బాంబులను పెట్టి పేల్చుతున్నారు. సమీపంలో గ్రామాలు ఉన్నా.. ప్రజలు నివసిస్తున్నా..ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నా.. వన్యప్రాణులకు ముప్పువాటిల్లుతున్నా.. చివరకు మనుషుల ప్రాణాలు పోతున్నా పట్టించుకునేవారు కరువవుతున్నారు. అనధికారికంగా పేలుడు పదార్థాలు విక్రయిస్తున్న వ్యాపారులపై ఎటువంటి చర్యలు లేకుండా పోతున్నాయి. దీంతో వీటి అక్రమాలు జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గనుల శాఖ పరిధిలో 301 క్వారీలు నిర్వహిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో 233 కలర్ గ్రానైట్, 56 రోడ్డు మెటల్ కంకర, గ్రావెల్.. క్వార్ట్జ్‌కు సంబంధించి 12 క్వారీలు ఉన్నాయి. వీటిలో చాలాచోట్ల అనధికారిక పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారు. సాధారణంగా (మిగతా 6వ పేజీలో..)



రణస్థలం: రాపాక, గారపేట క్వారీలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇదేం మతలబు?

- అప్పుడు 50 మంది అవసరమన్నారు
- ఇప్పుడు 15 మంది చాలంటున్నారు
- ఆదిత్యాలయంలో దినసరి ఉద్యోగుల నియామకంపై పైరవీలు
- పనిచేయని వ్యక్తులకే మళ్లీ చాన్స్
- రాజకీయ సిఫారసులతో జాబితా తయారు?



అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం

అరసవల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో దినసరి ఉద్యోగుల నియామకంపై పైరవీలు జోరందుకున్నాయి. ఇప్పటికే దినసరి ఉద్యోగులుగా సేవలందిస్తున్న 49 మందిని తొలగించి, కొత్తగా 15 మందిని ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే, ఎక్కడైనా బాగా పనిచేసిన వారికి ఉద్యోగాలు ఇస్తారు. కానీ, ఆదిత్యాలయంలో మాత్రం రాజకీయ సిఫారసుల కారణంగా పని చేయని వ్యక్తులకు ఉద్యోగం ఇచ్చేందుకు జాబితా తయారు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నిజానికి ఆదిత్యాలయంలో కనీసం 50 మంది దినసరి సిబ్బంది అవసరం అని గతంలో విచారణాధికారిగా ఆలయానికి వచ్చిన డీసీ శోభారాణి చెప్పారు. అదే అధికారి ప్రస్తుత ఈవో భద్రాజీ సెలవుల్లో ఉండడంతో ఇన్‌చార్జిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అయితే, ఇప్పుడు 50 మంది సిబ్బంది అవసరం లేదని, 15 మందిని ఔట్ సోర్సింగ్ ద్వారా నియమిస్తే చాలని అంటున్నారు. ఈ లిస్టును ఫైనలైజ్ చేయడానికి ముగ్గురు సభ్యుల కమిటీ గురువారం విశాఖలో సమావేశమైంది. కేవలం 15 మంది సిబ్బందినే సిఫారసు చేయాలనడం, అందులోను రాజకీయ పలుకుబడి గల కుటుంబాలకు సంబంధించిన వ్యక్తులను నియమించాలనుకోవడం, ఆలయ అభివృద్ధిని, ప్రతిష్ఠను నీరుకార్చడమే తప్ప మరొకటి కాదని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకీ అలసత్వం?

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయం ప్రస్తుతం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈవో స్థాయి నుంచి డీసీ స్థాయికి చేరుకుంది. నిజానికి డీసీ స్థాయి ఆలయంలో 80 వరకూ సిబ్బంది అవసరం ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా 49 మంది దినసరి వేతన ఉద్యోగుల సేవలతోనే అరసవల్లి ఆలయం అభివృద్ధి చెంది డీసీ స్థాయికి చేరుకుందనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ, గత 16 నెలలుగా (మిగతా 7వ పేజీలో..)

అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

- లైసెన్స్ రెన్యువల్ కూడా చేయలే
- సినిమా థియేటర్ల తనిఖీలో గుర్తించిన అధికారులు


శ్రీకాకుళం/క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టూరిజం మంత్రి ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరంలోని అన్ని సినిమా థియేటర్లను గురువారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. పరిషత్ సమీపంలోని కిన్నెర, కీర్తన, కీర్తిక, ఎన్జీవో భవనం పక్కన ఉన్న మారుతి, రామలక్ష్మణ్ జంక్షన్‌లోని ఎస్‌వీసీ, సరస్వతి తదితర థియేటర్లను తనిఖీ చేశారు. పార్కింగ్, టిక్కెట్ల ధరలు, తినుబండారాల ధరలు, అగ్నిమాపక పరికరాలు, పరిశుభ్రత, అన్ని విధాలా లైసెన్స్‌లు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. మారుతీ థియేటర్‌లో వైద్యఆరోగ్యశాఖ మంజూరు చేసే ధ్రువపత్రం లేదని తనిఖీలో బయటపడింది. దీంతోపాటు ఫైర్ డిపార్టుమెంట్ జారీ చేసే లైసెన్స్‌ను కూడా రెన్యువల్ చేయలేదని గుర్తించారు. దీనిపై థియేటర్ యాజమాన్యానికి నోటీసులు జారీచేయనున్నారు. ఎస్‌వీసీ థియేటర్‌లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, అక్కడక్కడా టైల్స్ పాడైనట్లు గుర్తించారు. సూర్యమహల్‌లో పలు లోపాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం తహసీల్దార్ గణపతిరావు, సూపరింటెండెంట్ పొదిలాపు శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఓ థియేటర్‌లో పాప్‌కార్న్ తూకం వేయిస్తున్న అధికారులు

రూ.1,204 కోట్లతో వాటర్ గ్రిడ్

- పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్మాణానికి శ్రీకారం
- టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లో తాగునీటి కష్టాలకు చెక్
- ఇప్పటికే మొదలైన సర్వే



వాటర్ గ్రిడ్ పరిధి

టెక్కలి నియోజకవర్గం :	497 గ్రామాలు
జనాభా :	2,80,984
రోజుకు లక్ష్యం :	42 మిలియన్ లీటర్లు
బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు:	12
నరసన్నపేట నియోజకవర్గం :	411 గ్రామాలు
జనాభా :	2,56,818
బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు :	12

టెక్కలి, మే 29 (ఆంధ్రజ్యోతి): టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల ప్రజల తాగునీటి కష్టాలను తీర్చే దిశగా అడుగులు పడుతున్నాయి. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఈ రెండు నియోజకవర్గాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలనే సదుద్దేశంతో రూ.1,204 కోట్లతో వాటర్‌గ్రిడ్ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రధానమంత్రి జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు వాటర్‌గ్రిడ్‌కు ప్రతిపాదనలు చేపట్టారు. పూణేకు చెందిన ఛాయిస్ సంస్థ టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో అవసరమైన వాటర్ లెవల్స్, పంపులు, సంపులతో పాటు పైపులైన్ల ఏర్పాటుకు సర్వే చేస్తోంది. గొట్టాబ్యారేజీ డెత్ స్టోరేజ్ వాటర్ పాయింట్ వద్ద ఇన్‌ఫిల్టరేషన్ వెల్స్ ద్వారా సుమారు 900 ఎంఎం పైపులైన్ డయాస్‌తో బొంతు జంక్షన్ కొండపై నిర్మించనున్న వాటర్ గ్రిడ్‌కు నీరు చేరనుంది. ఇక్కడ వాటర్ ప్యూర్‌పై జరిగిన తరువాత నరసన్నపేట నియోజకవర్గానికి సంబంధించి చల్లపేట మీదుగా పైపులైన్ ద్వారా 411 గ్రామాలకు, టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి వయా జర్జంగి మీదుగా కొత్తపేట కొండపైకి నీరు చేరుతుంది. ఇక్కడ నుంచి ఇంటర్నల్ పైపులైన్ల ద్వారా టెక్కలి నియోజకవర్గంలో 497 గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ వాటర్ గ్రిడ్‌ను నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు (మిగతా 7వ పేజీలో..)

మహానందంతో..

- మహానాడులో జిల్లా నేతలు, కార్యకర్తల సందడి 6 లో



వేడుకగా జలయాత్ర 6 లో



రహ'దారుణాలు'

- గోతుల్లో చేరిన నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు 8 లో



డీఅడిక్షన్ కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి

- మద్యం ముడి సరుకులను నియంత్రించాలి : కలెక్టర్ 7 లో




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





చంపేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

పేలుడు సామగ్రి వినియోగించాలంటే పెట్రోలియం అండ్ పేలుడు పదార్థాల భద్రత సంస్థ (పెసో) అనుమతితో కూడిన లైసెన్స్ మంజూరు చేయాల్సి ఉంటుంది. భద్రతా ప్రమాణాల దృష్ట్యా ఎక్కువ మందికి దీనిని మంజూరు చేయరు. అంత సులభంగా లైసెన్స్ ఇవ్వరు. ప్రస్తుతం జిల్లాలో మూడు సంస్థలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అయితే, క్వారీలు ఎక్కువగా నడుస్తున్న ప్రాంతాల్లో అనధికారికంగా విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఒడిశాలో వీటి ధర తక్కువగా ఉండడంతో అక్కడ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అనధికారంగా టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం వంటి పట్టణాల్లో అధికంగా గ్రానైట్ పేలుడు పదార్థాలు అమ్మకాలు సాగుతున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం కొంతమంది అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలు పట్టకుండా తెస్తున్న పేలుడు పదార్థాలతో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

కానరాని చర్యలు

గత ఐదు సంవత్సరాల్లో అధికారిక లెక్కల ప్రకారం క్వారీ ప్రమాదాల్లో 20 మందికిపైగా మృతిచెందారు. 50 మంది వరకూ క్షతగాత్రులయ్యారు. అయినా సరే యంత్రాంగంలో కనీస చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిలెటిన్ స్టిక్స్ వంటి పేలుడు పదార్థాలు వినియోగించాలంటే క్వారీ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్, గనులు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అనుమతులు పొందాలి. స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారమందించాలి. అటు తరువాత లైసెన్స్‌దారుడు నుంచి మాత్రమే పేలుడు పదార్థాలు కొనుగోలు చేయాలి. నిపుణుల సమక్షంలో వాటిని పేల్చాల్సి ఉంటుంది. అదే సమయంలో క్వారీలో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలి. వారికి లైఫ్ జాకెట్‌తో పాటు రక్షణ సామగ్రి అందించాలి. క్వారీకి 500 మీటర్ల వరకు జనసంద్రత లేకుండా చూసుకోవాలి. పేలుళ్ల చేసేముందు సైరన్ మోగించాలి. బ్లాస్టింగ్ చేసేవారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి భద్రత కల్పించాలి. కానీ, జిల్లాలో ఇవి ఎక్కడా కనిపించడం లేదు. నిపుణులను తీసుకువస్తే వారికి అధికంగా జీతాలు ఇవ్వాలనే ఉద్దేశంతో కొన్ని క్వారీల్లో కార్మికులతోనే పేలుళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ఫలితంగానే క్వారీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పర్యవేక్షణ కరువు..

ఇటీవల మెళియాపుట్టి మండలంలో క్వారీ ప్రమాదం జరిగిన తరువాత అధికారులు హడావుడి చేశారు. రెండు రోజుల పాటు వరుసగా క్వారీలు తనిఖీ చేశారు. వాస్తవానికి నిర్ణిత సమయంలో విధిగా క్వారీలు తనిఖీలు చేయాలి. గనులు, పోలీస్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, భద్రత, అగ్నిమాపక శాఖలు క్వారీలను నిత్యం పర్యవేక్షిస్తుండాలి. నిత్యం తనిఖీలు చేపట్టి నిబంధనాలు ప్రకారం నడుపుతున్నారా? అన్నది పరిశీలించాలి. లేకుంటే చర్యలకు ఉపక్రమించాలి. కేసులు నమోదు చేయాలి. కానీ, ఏదైనా ఘటన జరిగినప్పుడు ఉరుకులు పరుగులు పెట్టడం. తరువాత దాని గురించి మరిచిపోవడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం క్వారీల నిర్వహణపై దృష్టిసారించాల్సి అవసరం ఉంది.

నివేదిక ఎక్కడ?

గత వైసీపీ ప్రభుత్వంలో అధికంగా వైసీపీ నేతల క్వారీలకే అనుమతులు ఇచ్చేవారు. దీంతో ఇష్టారాజ్యంగా పేలుళ్లకు పాల్పడినా ఎవరూ పట్టించుకునేవారు కాదు. జగన్ ప్రభుత్వంలో టీడీపీ నేతలకు చెందిన క్వారీలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేయడంతో వాటిని మూసివేశారు. ప్రస్తుతం అధికంగా వైసీపీ నేతలకు చెందిన గ్రానైట్ క్వారీలే ఉన్నాయి. కూటమి సర్కారు వచ్చిన తరువాత గ్రానైట్ క్వారీలపై ఫిర్యాదులు అందడంతో సుమారు ఐదు నెలల పాటు జిల్లాలో పర్మిట్లు నిలుదల చేసింది. విచారణ చేపట్టాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించింది. కానీ, ఇప్పటికీ నివేదిక బయటకు రాలేదు.

చర్యలు శూన్యం..

మెళియాపుట్టి మండలంలోని వీఆర్‌టీ గ్రానైట్ క్వారీలో ఈ నెల 16న బ్లాస్టింగ్ జరిగి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. అయితే, యాజమాన్యం మాత్రం పిడుగుపడి కార్మికులు మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులకు చెప్పింది. దీనిపై మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేయడంతో కలెక్టర్, ఎస్పీ వెళ్లి గ్రానైట్ క్వారీని పరిశీలించారు. బ్లాస్టింగ్ వల్లే కార్మికులు మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే, ఇంత వరకు క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలోనే అరెస్టు చేస్తాం

క్వారీల్లో అనుమతులు లేకుండా పేలుడు సామగ్రి వినియోగిస్తే కేసులు నమోదు చేస్తాం. వీఆర్‌టీ గ్రానైట్ క్వారీలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటనకు సంబంధించి యాజమాన్యంపై కేసు నమోదు చేశాం. త్వరలోనే అరెస్టులు చేస్తాం. అన్ని క్వారీలను తనిఖీ చేస్తున్నాం.

- రమేష్‌బాబు, ఎస్ఐ, మెళియాపుట్టి

ప్రత్యేక దృష్టి సారించాం

జిల్లాలో క్వారీల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ముఖ్యంగా పేలుడు పదార్థాల వినియోగానికి అనుతులు తప్పనిసరి. శిక్షణ పొందినవారే ఈ పేలుడు పదార్థాలు వినియోగించాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని క్వారీల్లో తనిఖీలు జరుగుతున్నాయి. ఇకపై నిత్య పర్యవేక్షణ, తనిఖీలు ఉంటాయి. ఎక్కడైనా నిబంధనలకు వ్యతి రేకంగా వ్యవహరిస్తే క్వారీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కేసులు కూడా నమోదుచేస్తాం

-కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

నైరుతి రుతు పవనాలపై అప్రమత్తం

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ విత్తనాలు, ఎరువుల పంపిణీపై కార్యాచరణ రూపొందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు నిల్వ చేసిన దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. విత్తనాలు, ఎరువుల పంపిణీకి ముమ్మర ఏర్పాట్లు చేయాలన్నారు. నదీ పరీవాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కాజ్‌వేలు, రోడ్లపైకి వరదనీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుతు, రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజల రక్షణే ముఖ్య బాధ్యతగా భావించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీపీవో భారతీ సౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, విపత్తుల నిర్వహణాధికారి రాము, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎంహెచ్‌వో కె.అనిత, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన బదిలీల ప్రక్రియ

(5వ పేజీ తరువాయి)

నిరీక్షించారు. ఆ తరువాత కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కౌన్సిలింగ్‌లో 82 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతిపై వెళ్లనున్నారు.


పీఎస్‌హెచ్‌ఎంల నియామకంపై సందిగ్ధం


జిల్లాలో ఈఏడాది ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో హెచ్‌ఎంల నియమాకంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎల్‌ఎఫ్‌హెచ్‌ఎంలుగా పనిచేసిన వారికి తొలుత ప్రాధాన్యత క్రమంలో పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమించనున్నారు. అయితే, సర్‌ప్లస్‌గా ఉన్న ఎస్‌ఏలతో తొలుత ఈ పోస్టులను భర్తీ చేయాలని విద్యాశాఖ అధికారులు భావించారు. అయితే, సర్‌ప్లస్ ఎస్‌ఏలో తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఏప సబ్జెక్టులు వారికి ప్రాధాన్యత ఇస్తారు అనేది మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అలాగే మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో పీఎస్‌హెచ్‌ఎంలు బదిలీల ప్రక్రియపై విద్యాశాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

మహానందంతో..

కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో మూడో రోజు గురువారం జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు సందడి చేశారు. పార్టీ అధినేత చంద్రబాబును, మంత్రి లోకేష్‌ను అభినందించారు. వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పాతపట్నం: సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


ఎచ్చెర్ల: మహానాడులో చంద్రబాబును కలిసిన డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్


అరసవల్లి: చంద్రబాబుతో జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు మెట్ట సుజాత


ఆమదాలవలస: సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే కూన రవికుమార్


జలయాత్రలో పాల్గొన్న మహిళలు

వేడుకగా జలయాత్ర

● ఆలయ ప్రతిష్ఠోత్సవాలకు శుభరాట

ఇచ్ఛాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధి ఎస్.పేట(బోర్డర్) గ్రామంలో వెలసిన ఉమా సహిత చంద్రశేఖర స్వామి దేవాలయ పునః ప్రతిష్ఠోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం శుభరాట వేశారు. సాయంత్రం బోర్డర్ గ్రామం నుంచి బాహుదా నది వరకు మహిళలు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి... నదిలో పూజలు చేశారు. నదీ జలాలతో మహిళలు కాలినడకన బోర్డర్ గ్రామానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ గల దేవాలయంలో నదీ జలాలను భద్రపరిచారు. శుక్రవారం అభిషేకాల అనంతరం ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ జలయాత్రలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పత్రి తవిటయ్య, సాలిన ఢిల్లీ యాదవ్, సాలిన మామయ్య, డాక్టర్ మట్టా శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.


శుభరాట వేస్తున్న గ్రామ పెద్దలు

ఇదేం మతలబు?

(5వ పేజీ తరువాయి)

దినసరి వేతనదారులకు జీతాలు అందడం లేదు. అయితే, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి చొరవతో 5 నెలల జీతాలు వారికి అందాయి. దేవస్థానం ఆదాయం ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తున్నా సిబ్బంది నియామకం, జీతాల చెల్లింపులో ఎందుకు ఇంతటి తర్జన భర్జనలు, అలసత్వం కనిపిస్తోందో ఆ ఆదిత్యునికే తెలియాలి. అలాగే ఆలయంలో గతంలో పనిచేసిన కొందరు దినసరి వేతన సిబ్బంది తప్పుడు బిల్లులు పెట్టి లక్షల రూపాయలు వసూళ్లకు పాల్పడేందుకు ప్రయత్నించినట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అలాగే, వారినికోసారి ఆలయానికి వస్తూ, విధులు సరిగ్గా నిర్వర్తించకుండా, జీతాలను మాత్రం ప్రతీ నెలా తీసుకునేవారని ఆరోపణలు ఉన్నాయి. అయితే, మళ్లీ వీరి పేర్లే కొత్తగా నియమించనున్న 15 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా అయితే ఆదిత్యాలయం బాగుపడేదెలా? అని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చిత్తశుద్ధితో ఆలోచించి, ఆలయ అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని, నియామకాలను కచ్చితమైన పద్ధతిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.1,204 కోట్లతో వాటర్ గ్రిడ్

(5వ పేజీ తరువాయి)

రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులు చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. వాటర్‌గ్రిడ్ వస్తుండడంతో టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెక్కలి ప్రజలకు మాటిచ్చా

ప్రతి గ్రామంపై నాకు అవగాహన ఉంది. వారి ప్రధాన సమస్యలు గుర్తించాను. ఎన్నికల్లో మాటిచ్చినట్లు ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం. ఇందుకు సంబంధించి రూ.1,204 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులకు ప్రతిపాదన చేశాం. మంజూరు కాగానే పనులు జరిపిస్తాం.

- కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి

క్షేత్రస్థాయిలో వాటర్ లెవల్స్ సర్వే

వాటర్‌గ్రిడ్ ద్వారా టెక్కలి నియోజకర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ప్రతిపాదనలుచేశాం.పూణేకు చెందినఛాయిస్ కంపెనీ క్షేత్ర స్థాయిలో వాటర్ లెవల్స్‌పై సర్వే చేస్తోంది. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని 497 గ్రామాలకు తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

- ఎస్.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, టెక్కలి

డీఅడిక్షన్ కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి

● మద్యం ముడి సరుకులపై నియంత్రణ పెట్టాలి : కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 29(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం వల్ల పేదలు, సామాన్యుల తీవ్ర అనారోగ్యానికి, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. డీ-అడిక్షన్ కేంద్రాలు సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోమద్యం బారిన పడిన కుటుంబాలకు జీవనోపాధి కల్పనపై ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీ మద్యం వల్ల బలహీన వర్గాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోందని,ఈ కుటుంబాలకు తక్షణ ప్రత్యామ్నాయం, జీవనోపాధిని కల్పించాలని సూచించారు. మద్యం తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై నియంత్రణ పెట్టాలని, ఇందులో ప్రధాన పాత్ర పోషించే వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీ-అడిక్షన్ కేంద్రాల సమర్థ ంగా వినియోగంపై జిల్లాలో ఏర్పాటు చేసిన కేర్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యకలాపాలను సమీక్షించారు. ఇప్పటివరకు కమిటీ ద్వారా 16 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా 595 మంది పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రంలో తొమ్మిది మంది చేరగా ఏడుగురు విజయవంతంగా పునరావాసం పొందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్, వైద్యారోగ్యశాఖ, పోలీసు, వెల్ఫేర్, విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గంజాయి నిర్మూలనే లక్ష్యం

● మద్యం దుకాణాల్లో కల్తీ లిక్కర్‌పై నిఘా

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రామచంద్రరావు

శ్రీకాకుళం క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి):జిల్లాలో గంజాయి,సారా, బెల్ట్ షాపులను పూర్తిస్థాయిలో నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 811 కోట్ల రూపాయలు మద్యం అమ్మకాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 12 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో అక్టోబర్ నుంచి1,537 నేరాలను నమోదు చేశామని, అందులో 1427 మందిని అరెస్టు చేశామని,28 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. జిల్లాలో 954 బెల్ట్ షాపులను మూసివేయించి 954 మందిని అరెస్టు చేసి, 1491 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశామన్నారు. ఒడిశానుంచి తరలిస్తున్న అక్రమ మద్యాన్ని పట్టుకొని 83 కేసులు నమోదుచేయగా 82మందిని అరెస్టు చేసి 52.37 లీటర్ల బీరు, లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని పదివాహనాలను సీజ్‌చేశామన్నారు. ఒడిశా నుంచి తరలిస్తున్న 40.32 కేజీల గంజాయిను పట్టుకొని మూడు కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశామన్నారు.జిల్లాలో బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించిన 111 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. సారాకు సంబంధించిన 385 కేసులు నమోదు చేయగా, 270మందిని అరెస్టు చేసి 4,131 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, 1500 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. జనవరి నుంచి నవోదయం2.0కార్యక్రమంద్వారాసారాను నిర్మూలిస్తున్నామన్నారు. మద్యం షాపుల్లో కల్తీలిక్కర్‌పై నిఘా ఏర్పాటు చేశామని, ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా నిరంతరం సీసీ కెమెరాల ద్వారా 24 గంటలు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అనుమానం వస్తే విశాఖలోని అల్ట్రామోడరన్ ల్యాబ్‌కు లిక్కర్‌ను తరలించి పరీక్షలు నిర్వహించి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిజిటల్ అసిస్టెంట్‌పై విచారణ



డిజిటల్ అసిస్టెంట్‌తో విచారణ నిర్వహిస్తున్న విశ్వేశ్వరరావు

కవిటి, మే29(ఆంధ్రజ్యోతి): లండారిపుట్టుగ గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌పై ఎంపీడీవో విశ్వేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పులకోసం వచ్చిన లబ్ధిదారులపై డిజిటల్ అసిస్టెంట్ ఈశ్వరరావు దురుసుగా ప్రవర్తించడంతో బుధవారం ఆంధ్రజ్యోతిలో నన్నే ప్రశ్నిస్తారా.. డిజిటల్ అసిస్టెంట్ హల్‌చల్ శీర్షికతో కథనం ప్రచురితయ్యింది.దీంతో స్పందించిన ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఈఓఆర్డీ అబ్దుల్ ఖాన్ సచివాలయానికి వెళ్లి విచారణ చేశారు. లబ్ధిదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఇకపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని డిజిటల్ అసిస్టెంట్‌ను హెచ్చరించారు.

చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం

ఆమదాలవలస, మే 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రగతిసాధ్యమని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బీవీరామ్ తెలిపారు. గురువారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఆపాలన్నారు.వైసీపీ కార్యకర్తలు జగన్‌మాయలో పడవద్దని సూచించారు. కడపలో టీడీపీ నిర్వహించిన మహానాడు అద్భుతంగా జరిగిందని, ఈఉత్సాహాన్ని చూసి వైసీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయ న్నారు. ఎన్‌టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేయడం తెలుగుజాతికి గర్వకారణమన్నారు.

నెల్లిపర్తిలో నిధుల దుర్వినియోగంపై విచారణ

ఆమదాలవలస, మే29(ఆంధ్రజ్యోతి):మండలంలోని నెల్లిపర్తి పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై గురువారం విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన చెట్టి నరసింగరావు పంచాయతీ నిధులు సర్పంచ్ దుర్వినియోగం చేశారని ఫిర్యాదు చేశారు.ఈ మేరకు డీఎల్‌పీవో ఐవీ రమణ నెల్లిపర్తి పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.గోపాలరావు, కార్యదర్శి ధనుంజయరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇచ్ఛాపురం, మే 29(ఆంధ్రజ్యోతి):ఈదుపురం జడ్పీ పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివిన వారంతా గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా సీతయ్య ఫౌండేషన్, వృద్ధాశ్రమానికి పూర్వవిద్యార్థులు రూ.12వేలు అందజేశారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

●జిల్లాలో మూడురోజులు వర్షాలు ● అల్లకల్లోలంగా సముద్రం ● చేపలవేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

శ్రీకాకుళం, మే 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. ఈ ప్రభావంతో జిల్లాలో మూడురోజులపాటు వర్షాలు కురవనున్నాయి. ఒడిశాలని బాలాసోర్‌కు తూర్పుగా వాయువ్య బంగాళాఖాతం 180 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైనట్లు వాతావరణశాఖ నిర్ధారించింది. శుక్రవారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశముంది. పశ్చిమబెంగాల్-బంగ్లాదేశ్ మధ్య తీరం దాటనుందని, లేకుంటే సాగర్ ఐలాండ్ ఖేపుపరా వద్ద తీవ్రవాయుగుండంగా మారి తీరం దాటనుందని అంచనా వేస్తున్నారు.వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయి.మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.సముద్రం కూడా అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు చేపలవేటకు మూడురోజులపాటు సముద్రంలోకి వెళ్లొద్దని భారత వాతావరణశాఖ అమరావతి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. జిల్లాకు చెందిన మత్స్యకారులు ఈ విషయాన్ని తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

స్పౌజ్ కేటగిరీలో 3,823 పింఛన్ల మంజూరు

శ్రీకాకుళం, మే 29(ఆంధ్రజ్యోతి):జిల్లాకు ఎన్టీఆర్ భరోసా కింద స్పౌజ్ కేటగిరీలో కొత్తగా 3,823 పింఛన్లు మంజూరయ్యాయి.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ఈ ఏడాది మే నెల నుంచి స్పౌజ్ కేటగిరీ పెన్షన్ల జారీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో నెలకు రూ.నాలుగు వేలు చొప్పున లబ్ధిదారులకు అందించేందుకు సెర్ప్ సీఈవో ఉత్తర్వులను జారీచేశారు.మంజూరైన పింఛన్లను జూన్12న లబ్ధిదారులకు అందించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

భవిష్యత్ తరాలకు యోగా వారసత్వ సంపద

రణస్థలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలకు యోగా వారసత్వ సంపద అని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు.గురువారం లావేరు, రణస్థలం మండలాల్లో ఏర్పాటు చేసిన యోగాంధ్రా కార్యక్రమాల్లో మాట్లాడుతూ యోగా భారతీయ జీవన విధానమని, యోగా పూరాతనమైన భారతీయ తత్వశాస్త్రమని తెలిపారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

●లావేరు, మే 29(ఆంధ్రజ్యోతి):యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని బొడ్డపాడు లో సీఎస్ గొడౌన్ వద్ద యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరాజు పాల్గొన్నారు.

●శ్రీకాకుళంకలెక్టరేట్, మే29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని విశాఖ-బీ కాలనీ సాయిబాబా మందిరం ఆవరణలో యోగాంధ్ర-2025 సన్నాహకాల్లో భాగంగా గురువారం యోగా శిక్షకులు మురళి, టి.స్వాతి పర్యవేక్షణలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే డీడీ కేవీ ఉజ్వల్, డి.శ్రీనివాస్, సెట్‌శ్రీ సీఈఓ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

● శ్రీకాకుళం రూరల్ మే29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సింగుపురంలో వివిధ పంచాయతీల్లో నమోదైన యోగా ట్రైనర్లకు శిక్షణ నిర్వహించారు కార్యక్రమంలో ఎంపీడీవో బి.శైలజ, ఆయుష్ వైద్యాధికారి బి.మహతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

●గార మే 29 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామ మోహనరావు తహసీల్దార్ ఎం.చక్రవర్తి, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు,ఆయుష్ డాక్టర్ పుష్పాంజలి పాల్గొన్నారు.

●సరుబుజ్జిలి, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.కార్య క్రమంలో ఎంపీడీవో ఎం.పావని, ఎంఈవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రామారావు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని పెద్దమందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, ముగ్గురికి కుట్టు మిషన్లు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థ అధ్యక్షుడు రామచంద్రరావు, కన్వీనర్ పెద్ద మందిరం కన్వీనర్ మురళి, భాస్కరరావు, గోవింద పాల్గొన్నారు.

మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి: ఏడీఏ



వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసే రైతులు మేలైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని ఏడీఏ రాజగోపాల్ తెలిపారు. గురువారం మండలంలోని కొండవలసలో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సమన్వయంతో వికసిత్‌కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఖరీఫ్ పంట కాలంలో విత్తన రకాలు, ఎంపిక, వాటి లభ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అనుబంధరంగాల్లో రైతులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు, రైతు సంక్షేమ పథకాలను వివరించారు.ముఖాముఖి కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలకు శా స్త్రవేత్తలు బాలకృష్ణ, శైలజ, అనూష సూచనలు చేశారు. కార్య క్రమంలో వ్యవ సాయ అనుబంధ రంగాల క్షేత్రస్థాయి సిబ్బంది, కేవీకే వ్యవసాయ పరిశో ధనా మండలి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నిత్యాన్నపూర్ణ పథకానికి బియ్యం వితరణ

శ్రీకాకుళం కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని రిమ్స్‌లో రోగుల సహాయకులకు సత్యసాయి సేవా సంస్థ నిర్వహిస్తున్న నిత్యాన్నపూర్ణ పథకానికి అరసవల్లికి చెందిన గ్రేస్ హెల్పింగ్ హేండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు బొత్స జనార్దనరావు, హేమలత దంపతులు ఐదు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. దాతలను రాష్ట్రఅధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షులు జి.రమణబాబు, ఫల్గుణరావు అభినందించారు.కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు,సభ్యులు భీమవరం బంగారం,ఉప్పాడ లక్ష్మీనారాయణ, జ్యోతి మధురవాణి పాల్గొన్నారు.

తోటపల్లి నుంచి నీరు విడుదల చేయాలి

రణస్థలం, మే 29 (ఆంధ్రజ్యోతి):తోటపల్లి నుంచి నీరు ఈ ఏడాది సకాలంలో విడిచిపెట్టి రైతులను ఆదుకోవాలని దేవరాపల్లి రైతులు వి.జోగురాజు మౌళి తదితరులు వ్యవసాయ అధికారులను కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు గురువారం తోటపల్లి కాలువ పరిధిలో పరిశీలించారు కార్యక్రమంలో దేవరాపల్లి, వేల్పురాయి, బంటుపల్లి రైతులు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

కవిటి, మే29(ఆంధ్రజ్యోతి): మేనెలలో పంపిణీ చేయాల్సిన రేషన్ సరుకులు ఇంత వరకు గ్రామంలో చాలామందికి పంపిణీచేయకపోవడంతో డీలర్‌పై చర్యలు తీసుకోవాలని లండారిపుట్టుగ గ్రామస్థులు కోరారు.ఈ మేరకు గురువారం తహసీల్దార్ బి.మురళీమోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎన్.ఎర్రయ్య పాల్గొన్నారు

జి.సిగడాంలో అసిరితల్లి అమ్మవారికి తీరువీధి

జి.సిగడాం, మే 29(ఆంధ్రజ్యోతి):జి.సిగడాంలో గురువారం అసిరితల్లి అమ్మవారి ఘటాలతో తిరువీధి నిర్వహించారు. అమ్మవారిఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు పురస్కరించుకుని వీధుల్లో మేళతాలాలు, మంగళవాయిద్యాలు నడుమ భక్తిశ్రద్ధలతో ఘటాలు ఊరేగించారు. మహిళలు ముర్రాటలతో మొక్కులు తీర్చుకున్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పొందూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కంచరాంలో నిర్మించిన 45 అడుగుల విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా వందలాది మంది కంకణదారణ చేశారు.

పుడమి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు

పాత శ్రీకాకుళం, మే29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనతో పాటు భవిష్యత్ తరాల కోసం పుడమిని సంరక్షించాలన్న అంశంపై ప్రపంచ పర్యావరణదినోత్సవం పురస్కరించుకొని శనివారం నుంచి జూన్ ఐదోతేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీసీబీ శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం పర్యవరణ ఇంజనీర్ కరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖన పోటీలు, జూన్ నాలుగో తేదీన శ్రీకాకుళంలో ఇంటర్ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పైడిభీమవరం, టెక్కలితోపాటు పలుచోట్ల ఐదు వేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు గుడ్డ సంచులు పంపిణీ చేస్తామని, జూన్ ఐదో తేదీన గ్రీన్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్నిన వివరాలకు 9494590115, 9010854409 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): చిలకపాలెం 132-33 కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మత్తుల దృష్ట్యా శుక్రవారం కింతలి, తోలాపి సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు మునిసిపల్ సమావేశం

ఇచ్ఛాపురం, మే29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం జరిగే సాధారణ సమావేశానికి కౌన్సిలర్లతోపాటు అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ జరగనుందని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరుకులు

ఇచ్ఛాపురం, మే29 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ ప్రారంభంకానుందని తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దే సరుకులు పంపిణీచేయనున్నట్లు పేర్కొన్నారు.

అహల్యాబాయికి నివాళి

ఇచ్ఛాపురం, మే29 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో రాజమాత మహారాణి అహల్యాబాయిహోల్కర్ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా సభ్యురాలు మంగి లక్ష్మి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ఇచ్ఛాపురం, మే29 (ఆంధ్రజ్యోతి):ప్రజలంతా ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి పీఎన్‌వీ లక్ష్మీనారాయణ కోరారు. గురువారం బూర్జుపాడు గ్రామ సచివాలయంలో డొంకూరు గ్రామానికి చెందిన క్రిస్టి యన్లతో సమావేశం నిర్వహించారు. కా ర్యక్రమంలో డీటీ శ్రీహరి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఈవోఆర్డీ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

బాకర్‌సాహెబ్‌పేటలో చోరీ

శ్రీకాకుళం క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని బాకర్ సాహెబ్‌పేటలో గురువారం ఓ ఇంటిలో చోరీ జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని బాకర్ సాహెబ్‌పేటలో నివాసముంటున్న బంటుపల్లి భాను, ఆయన భార్య తన మామగారు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి వెనుక తలుపులు తీసి ఉన్నాయి. అలాగే బీరువా బద్దలు కొట్టి ఉండడాన్ని గమనించారు. బీరువాలో రూ.20 వేలు నగదు అపహరణకు గురైందని నిర్ధారించుకొని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ ఎస్ఐ సంతోష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తుచేపట్టారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

శ్రీకాకుళం క్రైం, మే29(ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం సేవించి నలుగురు వ్యక్తులు డీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఓ హెచ్‌సీపై గురువారం రాత్రి దాడిచేశారు. శ్రీకాకుళంలోని డీసీఆర్‌బీలో హెచ్‌సీగా పనిచేస్తున్న రమణ రాత్రి పది గంటల సమయంలో విధులు ముగించుకుని మంగువారితోటలోని ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో నలుగురు వ్యక్తులు మంగువారితోట సమీపంలో అడ్డగించారు.దురుసుగా మాట్లాడడంతోపాటు రమణపై దాడిచేయడంతో గాయపడ్డాడు.ఈమేరకు రాజేష్, వాసులపై రిమ్స్ అవుట్ పోస్టులో రమణ ఫిర్యాదుచేశాడు. రమణ రిమ్స్‌లో చికిత్సపొందుతున్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.







టోల్‌గేట్ సిబ్బందితో వాగ్వాదం

- ఎక్కువ లోడు చూపించారంటున్న లారీ డ్రైవర్


ఏఎస్‌ఐకి సమస్యను వివరిస్తున్న బాధితుడు

పలాసరూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం లక్ష్మీపురం సమీపంలో ఉన్న హైవే టోల్‌గేట్ వద్ద అధిక లోడ్ చూపించారంటూ ఓ లారీ డ్రైవర్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ఘటన బుధవారం రాత్రి సంభవించింది. కాకినాడకు చెందిన ఓ లారీ డ్రైవర్ జార్ఖండ్ రాష్ట్రం జమ్‌షెడ్‌పూర్ నుంచి టూల్స్‌తో కాకినాడకు వెళ్తూ బుధవారం రాత్రి లక్ష్మీ పురం టోల్‌గేటు వద్దకు చేరుకుంది. ఐదు లైన్లలో మొదటి లైనులోకి ఆ లారీ రాగానే అధిక బరువు ఉందని చెప్పడంతో డ్రైవర్ రమేష్ టోల్‌గేటు సిబ్బందిని ప్రశ్నించారు. జమ్‌షెడ్‌పూర్ నుంచి తాను వస్తున్నానని, అన్ని చోట్ల తన లారీ సరైన బరువుతోనే ఉందని, కేవలం ఒక్క పలాసలోనే అధిక బరువు ఏమిటని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. డ్రైవర్ లోడు వివరాలు, ఇతర సమాచారం కలిగిన పత్రాలను చూపించినా టోల్‌గేటు సిబ్బంది పట్టించు కోలేదు. లారీని నిలుపుదల చేయడంతో ఇతర డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో లారీ డ్రైవర్ వివాదంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. సదరు డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేశారు. అయితే ఆ ఛాయలు ఏమీ లేకపోవడంతో రూ.1035 వసూలు చేసి వదిలివేశారు. దీంతో లారీ డ్రైవర్ దిక్కుతోచని స్థితిలో పలాస నుంచి మరలా టోల్‌గేటు వద్దకు వచ్చాడు. జరిగిన ఘటనను విజయవాడలోని లారీ ఓనర్ల సంఘం ప్రతినిధులకు సదరు డ్రైవర్ రమేష్ వివరించారు. ఈ వివాదం జరుగుతుండగా కాశీబుగ్గ-పలాస ఇతర ప్రాంత లారీ, ట్రక్కు డ్రైవర్లు అక్కడకు చేరుకున్నారు. టోల్ సిబ్బంది అధికంగా వసూలు చేస్తున్నారని, దీనిని ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారని ఆరోపించారు. ఘటనా స్థలానికి ఏఎస్‌ఐ గోవిందరాజులు గురువారం ఉదయం చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహారథి లారీ డ్రైవర్లతో కలిసి కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావుకు ఫిర్యాదు చేశారు. మరలా ఇటువంటి వివాదాలు పునరావృతం కాకుండా ఇరువర్గాలు చూడాలని, టోల్‌గేటు సిబ్బంది అక్రమ వసూలుకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. మరలా ఇలాంటి వివాదం లేకుండా ఇరువర్గాలు జాగ్రత్త పడాలని సూచించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి


అప్పలరాజు (ఫైల్)

ఎచ్చెర్ల, మే 29(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం గ్రామానికి చెందిన ఒకరు చికిత్సపొందుతూ మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. చిలకపాలెం గ్రామానికి చెందిన ఒనుము అప్పలరాజు (47) ఆటో డ్రైవర్‌గా పనిచేసి జీవిస్తున్నాడు. ఆయనకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ విషయంపై భార్య భారతితో గొడవపడుతుండేవాడు. ఇదే క్రమంలో ఈనెల 27న కూడా గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన అప్పలరాజు ఆ రోజు ఉదయం గడ్డిమందును తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అప్పలరాజుకు భార్య, కుమారుడు పవన్‌కుమార్ ఉన్నారు. కుమారుడు పవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

కొత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాద్ హెచ్చరించారు. గురువారం కొత్తూరు కళాశాల మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. త్రిబుల్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలుంటాయని స్పష్టంచేశారు.

సైనిక్‌నగర్‌లో రోడ్లపై వర్షపునీరు


నీటిలో మునిగిన రోడ్లు, ఖాళీ ప్రదేశాలు

టెక్కలి, మే 29(ఆంధ్రజ్యోతి): తొలుసూరుపల్లి పంచాయతీ సైనిక్ నగర్‌లో మూడు రోజులు గా కురిసిన వర్షాలకు రోడ్లన్నీ వర్షపు నీటితో మునిగిపోయాయి. దీంతో వాహనాల రాకపోక లకు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. రోడ్లపైనే కాకుండా ఇళ్ల పక్క ఖాళీ ప్రదేశా ల్లోనూ నీరు నిలిచి అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా ఇదే పరిస్థితి అని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరు తున్నారు.

బురదగా బడబంద-కోటిపల్లి రోడ్డు


బురదమయంగా బడబంద రోడ్డు

నందిగాం, మే 29(ఆంధ్రజ్యోతి): శివరాంపురం రహదారి నుంచి బడబంద, కోటిపల్లి వెళ్లే రోడ్డు బురదమయంగా తయారైంది. ఎడతెరిపి లేని వర్షాలతో రోడ్డు దారుణంగా తయారు కావడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. శివరాంపురం రహదారి నుంచి బంజీరుపేటకు వెళ్లే మార్గంలో వర్షపునీరు చేరి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అంతర్జాతీయ పోటీలో అనిరుధ్‌కు బంగారు పతకం


బంగారం పతకం అందుకుంటున్న అనిరుధ్

మెళియాపుట్టి, మే 29(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలో మెళియాపుట్టినికి చెందిన పొట్నూరు అనురుధ్ బంగారుపతకం సాధించాడు. శ్రీలంకలో రోల్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడని తండ్రి పి.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అనిరుధ్‌ను పలువురు అభినందించారు.

రహ'దారుణాలు'

- గోతుల్లో చేరిన నీరు
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు


మర్లపాడు వద్ద పూండి రోడ్డు దుస్థితి

వజ్రపుకొత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): బెండిగేటు నుంచి పాత టెక్కలి వరకు పూండి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గోతులు కావడంతో వర్షం పడితే చాలు నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వజ్రపుకొత్తూరు, నందిగాం, సంతబొమ్మాళి, టెక్కలి మండలాలను కలిపే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలాగే పూండి వాణిజ్య కేంద్రమైనందున నిత్యం ప్రజలు మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు చేరి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హిరమండలం బస్టాండ్ వద్ద రోడ్డు

ఆర్టీసీ బస్టాండ్ వద్ద..

హిరమండలం, మే 29(ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని అలికాం-బత్తిలి ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఇప్పటికే రోడ్డంతా గోతులుగా మారగా ఇటీవల కురిసిన వర్షా లకు గోతుల్లో నీరు చేరి మరింత దారుణంగా ఉంది. వాహనాలు, మారింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెద్ద గోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ మార్గంలో ప్రయాణమంటేనే హడలెత్తే పరిస్థితి నెలకొంది.

నీటి కుంటలను తలపిస్తున్న రోడ్లు

ఎల్.ఎన్.పేట, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు దారుణంగా ఉన్నాయి. అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ముంగెన్నపాడు జంక్షన్ నుంచి గ్రామం మీదుగా మతలబుపేట, సిద్ధాంతం గ్రామాలకు ఉన్న రోడ్డు దారునంగా ఉంది. గోతులుగా ఏర్పడి రాళ్లు తేలి రోడ్డు స్వరూపాన్నే కోల్పోయింది. అలాగే మోదుగవలస జంక్షన్ నుంచి బోరమాంబపురం, కొమ్మువలస, గొట్టిపల్లి గ్రామాల మీదుగా కొండశివారులోని పలు గిరిజన గ్రామాలకు ఉన్న కొమ్మువలస రోడ్డుపై గోతులు నీటి కుంటలను తలపిస్తున్నాయి. సిద్ధాంతం, కృష్ణాపురం, ఉప్పర పేట, గడేవాని పేట, సుమంతాపురం గ్రామాల రోడ్డు పాడైంది. దీంతో ఆయా గ్రామాలకు రాక పోకలు సాగించే ప్రజలు నిరంతరం ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకో వాలని ప్రజలు కోరుతున్నారు.


కొమ్మువలస రోడ్డు →

పట్టణాల్లో కార్డన్ సెర్చ్


నరసన్నపేట: పురుషోత్తమ నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


పాతపట్నం: పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రామారావు


టెక్కలి: వ్యక్తుల వివరాలను పరిశీస్తున్న సీఐ విజయ్‌కుమార్

నరసన్నపేట/టెక్కలి/పాతపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గురువారం నరసన్నపేట, టెక్కలి, పాతపట్నంలలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నరసన్నపేట పట్టణంలోని పురుషోత్తమనగర్, టెక్కలి ఆదిఆంధ్రా వీధి, పాతపట్నం రెల్లి వీధుల్లో సీఐలు ఎం.శ్రీనివాసరావు, ఎ.విజయ్‌కుమార్, వి.రామారావు ఆధ్వర్యంలో తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. కొత్త వ్యక్తులు, అనుమానులు వివ రాలు సేకరించారు. ఇళ్లలో ఉన్నవారి ఆధార్ కార్డులను పరిశీలించారు. సరైన ధ్రువ పత్రాలు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐలు తెలిపారు. కార్యక్రమాల్లో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, పాతపట్నం ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, రంజిత్, అశోక్‌బాబు, అనిల్ కుమార్, ఎస్. లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డిష్యుం.. డిష్యుం



వజ్రపుకొత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): ఓ రెండు ఉడతలు ఫైటింగ్ చేసుకుంటూ ఉన్న వీడియోలు గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పెదవంక గ్రామంలో ఓ ఇంటి పైకప్పుపై ఈ దృశ్యం కనిపించింది. కొందరు స్థానిక యువకులు వీటిని ఫొటోలు తీశారు. వెంటనే అదిలిస్తే అవి వెళ్లిపోయాయి.

యుద్ధప్రాతిపదికన కల్వర్టు పనులు



కల్వర్టుపై కాంక్రీట్ వేస్తున్న దృశ్యం

టెక్కలి, మే 29(ఆంధ్రజ్యోతి): నౌపడా- మెళియాపుట్టి స్టేట్ హైవే రోడ్డు పరిధిలోకల్వర్టు పనులు ముమ్మరం చేశారు. ఐదు రోజులుగా కల్వర్టు పనులు నత్తనడకన సాగుతుం డడంతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'తవ్వి వదిలేశారు' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పనుల నిర్వహణను ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పరిశీలించారు. అలాగే ఆర్‌అండ్‌బీ డీఈఈ రవికాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ, టెక్కలి ఈవో వెంకట్రావు, పోర్టు యంత్రాంగం కల్వర్టు, పైపులైన్ నిర్మాణ పనులు చేయించారు. శుక్రవారం నుంచి వాహనాలు నడి పేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు

పాతపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో రైతుబజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏఎంసీ డీడీ జి.శ్రీనివాస్‌కిరణ్ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డును గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల వినతి మేరకు రైతుబజార్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలిపారు. ఇప్పటికే స్థలం కోసం తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చామన్నారు. ఏఎంసీ కార్యదర్శి రాజా రామ్మోహన్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ఎల్.ఎన్.పేట, మే 29(ఆంధ్రజ్యోతి): కోవిలాం గ్రామంలోని క్షీర రామలింగేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వేద పండితుడు యర్రగుంట్ల సంపత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించ నున్నట్టు ఆలయ ధర్మకర్త బెన్నాడ తవుడు తెలిపారు. గురువారం ఉత్సవ విగ్రహాలను పల్ల కిలో ఉంచి మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. మహిళలు కలశాలతో ఆలయానికి చేరుకుని ముర్రాటలు సమర్పించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

పోలాకి, మే 29(ఆంధ్రజ్యోతి): పల్లిపేట పంచాయతీ పరిధి చింతమానిపేటలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. మూడు రోజుల పాటు ఆలయ అర్చకుడు శంకర్ భక్తులతో పూజలు చేయించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

3వ తేదీకి భూముల కౌలు వేలం వాయిదా

జలుమూరు, మే 29(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామి భూముల కౌలు వేలంపాట వచ్చే నెల 3వ తేదీకి వాయిదా వేసినట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. గురువారం నిర్వహించాల్సిన భూముల కౌలు వేలంపాట అనివార్యకారణాల వల్ల నిలిచిపోయిందన్నారు. రైతులు వేలంపాటలో పాల్గొనాలన్నారు.

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోండి


ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మే 29(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. గురువారం టెక్కలిలో వంశధార డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువ, చెరువుగట్లు ఎక్కడ బలహీనంగా ఉన్నాయో గుర్తించి అవసరమైతే యుద్ధప్రాతిపదికన పటిష్ఠం చేయించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీరందించేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వంశధార ఈఈ బి.శేఖరరావు, డీఈఈలు కె.శ్రీధర్, ఎస్.శ్రీనివాసరావు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అదనపు భవనం పూర్తి చేయాలి


ఏరియా ఆసుపత్రిలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ సత్యప్రసాద్, డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబు

నరసన్నపేట, మే 29(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనం పనులను సకాలంలో పూర్తి చేయాలని డీసీహెచ్‌ఎస్ డా.కల్యాణ్ బాబు ఏపీఎంఎస్‌ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నాలుగేళ్లుగా ఆసుపత్రి అదనపు భవనాలు నిర్మాణం సాగుతున్నాయని.. మార్చి నాటికి ఎందుకు పూర్తి చేయ లేదని ప్రశ్నించారు. ఆసుపత్రి ఆవరణలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సత్యప్రసాద్, సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోతుల్లో పడుతున్న పశువులు

- నిర్లక్ష్యంగా జేజేఎం అధికారులు


ఆవును బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌వాల్వ్ గోతులు ప్రమాదాలకు నిలయంగా తయారవుతున్నాయి. ఈ గోతులపై పైకప్పుడు ఏర్పాటు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ గోతుల్లో పశువులు పడి గాయాలబారిన పడుతున్నాయి. నీటి కోసం వెళుతూ గోతుల్లో పడి పోతున్నాయి. ఇలాంటి ఘటనే మూడు రోజుల కిందట చీపురుపల్లి పంచాయతీ గడివూరులో సంభవించింది. గ్రా మంలోని ఓ ఎయిర్ వాల్వ్ గోతిలో ఓ ఆవు ప్రమాదవశాత్తు గోతిలో పడిపోయింది. అయితే గురువారం అటుగా వెళుతున్న స్థానికులు చూసి వెంటనే బయటకు తీశారు. వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ఆవు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి మెట్టూరు పంచాయతీ డెప్పూరు జంక్షన్ వద్ద ఉందని ఆ గ్రామస్థులు చెబు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎయిర్ వాల్వ్‌లపై పలకలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'అంతిమ' పాట్లు



పాతపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలం సింగుపురం గ్రామంలో ఎస్సీ శ్మశానవాటికకు వెళ్లేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు మీసాల వెంకట్రావు (38) గురువారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని బురదతో ఉన్న పొలాల గుండా తీసుకువెళ్లేం దుకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. అనేకపోరాటాలు చేస్తున్నా దళిత శ్మశానవాటికలకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని దళిత హక్కుల పోరాటసమితి ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి అన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, మే 29(ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కుపల్లి, బైపల్లి, మోట్టూరు, చీపురుపల్లి, గరుడభద్ర పంచాయతీల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నరసన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో..

నరసన్నపేట, మే 29(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నా మన్నారు. ఈ నేపథ్యంలో నరసన్నపేట, సత్యవరం, బొరిగివలస, జమ్ము, తామరాపల్లి, గొట్టిపల్లి, కరగాం, కంబకాయి. దూకలపాడు, చల్లబంద, జిల్లేడివలస, జడుదు, యాట్లబసివలస, ఈదులవలస జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

మందస మండలంలో..

మందస, మే 29(ఆంధ్రజ్యోతి): పలాస 132/3 కేవీ సబ్‌స్టేషన్‌లో పనులు చేపడుతున్నందున మందస మండలంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పలాస డివిజన్ ఈఈ జి.మల్లేశ్వరరావు తెలిపారు.

నౌపడ సబ్‌స్టేషన్ పరిధిలో..

సంతబొమ్మాళి, మే 29(ఆంధ్రజ్యోతి): నౌపడ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు తెలిపారు. టెక్కలి సబ్‌స్టేషన్ పరిధిలో 220, 13, 133కేవీల్లో మెయింటినెన్స్ దృష్ట్యా నౌపడ, హనుమంతునాయుడుపేట, మూలపేట, ఆకాశలక్కువరం, మేఘవరం, భావనపాడు, యామలపేట, మర్రిపాడు, ఎం.సున్నాపల్లి, ఇజ్జువరం పంచాయతీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సంపద సృష్టి ఒట్టి బూటకం

నరసన్నపేట, మే 29(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి అంటూ చేస్తున్న ప్రచారం ఒట్టి బూట కమని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గురువారం స్థానికంగా ఓ కల్యాణ మండ పంలో వైసీపీ నియోజక వర్గ కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు సంపద సృష్టి పేరుతో దోచుకుంటున్నారని విమర్శించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో చిన్న అలక్ష్యంతో వైసీపీ భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో చికెన్‌పై పన్ను విధించిన ఘనత టీడీపీ ఎమ్మెల్యేలకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంబా రవిబాబు, జడ్పీ చైర్మన్ పిరియా విజయ, నేతలు పేడాడ తిలక్, చింతాడ రవికుమార్‌పాల్గొన్నారు.

ప్రాణనష్టం లేకుండా చూడాలి

జలుమూరు, మే 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయా లని తహసీల్దార్ జె.రామారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమా వేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావం వల్ల ఒడిశాలో వర్షాలు కురిసి వంశధార నది పొంగి పొర్లే అవకాశం ఉండడంతో నదీతీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, హెచ్‌సీ ధర్మారావు పాల్గొన్నారు.